కథానిక

# నిరుద్యోగి నిట్టూర్పు

వడ్లపట్ల దయానందం

బ్రతికి బట్టకట్టి మనిషిగా చలామణీ అవుతున్న ప్రతి వొక్కరికీ, బ్రతుకు తెరువు, కల్పించవలసిన భారం, మోయడానికి బద్ధకించి విడిచిపెట్టిన చట్టం కనీసం—చావడానికైనా అనుమతివ్వదేం? బ్రతకలేక చావాలనుకున్నా ఆత్మహత్య, మహా పాతకమంటూ వకీల్లు—అడ్డుతగిలి ఊరుకుంటుందేం? అటు బ్రతకటానికి సావకాశంలేక ఇటు చావటానికి వీల్లేక మధ్యస్థంలో పడి ఎలా చచ్చేది? భార్యామణికి, తోడుగా మన ప్రజ్ఞకు ఫలితంగా అవతరించిన మరో చంటిజీవాన్ని ఒడిలో పెట్టి లక్షణంగా పుట్టింటికనిపి నానాగడ్డీకరుస్తూనే నిక్షేపరీయుడిలా ఇలా ఒంటరిగా, ఎంతకాలం తిరిగేది?" అంటూ గాఢంగా నిట్టూర్చి దీనంగా కూలబడుతూ "ఓ సిగరెట్ ఉంటే ఇలా ఇవ్వండిరా" అంటూ బృందం మొత్తానికో విజ్ఞప్తి పారేశాడు నిరుద్యోగి 'రామం'.

వెలువడ్డ విజ్ఞప్తి ఏ ఒక్కర్నీ ఉద్దేశించని కారణంగా ఎవరికి వారే మిన్నకుండేసరికి, ఏర్పడ్డ నిశ్శబ్దతను సహించలేక రామం ఆఖరుకు సుందరం పేరు సూచించాడు.

మొదట ప్రాణాం చివుక్కుమన్నా ఒంటరిమణాలాకి, పట్టుచేసుకున్న, సందర్భంలో ఏర్పడ్డ సంతోషఫలితంగా ఉత్సాహంగానే, రామం, దగ్గరకో సిగరెట్ విసిరేశాడు. అయినా కాకపోయినా ఉంచుకుని లేదనటం మిత్రబృంద నిర్ణయాలకే విరుద్ధం, నిర్ణయాలని తెలివిగాగెంటేసి, కనబడని విధంగా, విరుద్ధంగా సంచరించే సభ్యులు సైతం లేకపోలేదు. వాళ్ళ సభ్యత్వపు పటుత్వం కూడా, అంతంత, మాత్రంగానే గుర్తించబడుతూంటుంది. అధిష్టానవర్గంచేత అధిష్టాన వర్గంలో అగ్రగణ్యుడు రామం.

బి. ఎ. నిరుద్యోగి, భావాలు బోలెడు; ఆశయాలు తట్టెడు. ఆదర్శాలు పుట్టెడు. ఆస్తిపాస్తులు శూన్యం. చావుకి సిద్ధంగాఉన్న తండ్రి ముద్దుల పట్టె కళ్యాణం కళ్లారా చూడాలనే తాపత్రయంకొద్దీ ఆకాస్త ఘనకార్యం నెరవేర్చుకుని ఓ సంవత్సరమైనా ఉండకుండానే పోతూ, పోతూ, "ఒరే అబ్బీ అబ్బాయిపుడితే నాపేరు. అమ్మాయిపుడితే దానిపేరు పెట్టరా" అని మారు మాటాడక చటుక్కున కళ్ళుమూశాడు. తండ్రి బ్రతికున్నంతకాలం తనకి ఉద్యోగం లేకపోయినా, తండ్రికొచ్చే పెంక్షన్ దుడ్డుతోనే భార్యారత్నానికి, పూలు, స్నోలు తన సాదరు, ఇంటిఖర్చు క్లుప్తంగా సవరిస్తూవచ్చాడు.

తండ్రిపోయిన రెండు మాసాలకే, తండ్రికోరిక ప్రకారం ఉద్భవించాడో ఉద్ధండుడు. నామకరణ మహోత్సవం నాడు తండ్రిపేరు వెడుతూనే చచ్చిన వాడిని సైతం లోలోపల నిందించుకోకుండా ఉండలేక పోయాడు.

కాఫీ పానీయానికి ఆరుకానుల మాటటుంచి, సిగరెట్ ముక్కకి, ఎర్రని కానీకరువై 'కింకర్తవ్యం' అనుకుంటూ మాసిన గెడ్డంతో ఓ ఫిలాసపర్‌లా, పోజిచ్చి కూర్చున్న తరుణంలో, లోపల భార్య ప్రసవవేదన బయటఇంటి అద్దెవాడి రోదన తన హృదయంలో ఆవేదన ఛీ-ఛీ-వెధవ బ్రతుకనుకున్నాడు. ఒక్కసారే కాదు వందసార్లనుకున్నాడు అయినా ఫలితం ఉద్యోగం వస్తుందన్న ఆశాలేదు. చావడానికి మనసూ వొప్పదు ఒకవేళ నొప్పినా చట్టం విరుద్ధమంటుంది. మళ్ళీ ఓసారి ఛీ-ఛీ అనుకున్నాడు.

సిరద్దారి గిరీవెలిగించినా-సిన్సియారిటీ,సిన్సియారిటీ అంటూనే చేతకానివాడై, ఓ కొంపన్నాకట్టి తగలబెట్టలేకపోయిన, తండ్రియొక్క సిన్సియారిటీవల్లయేర్పడ్డ అనర్థం, ఇంటి అద్దెవాడి రోదనవల్లకాని బయటపడలా...తను నిరుద్యోగిగా తిరుగుతూండడం కళ్ళార చూస్తూండికూడా తాపత్రయం

కొద్దీ అంటగట్టిన భార్యామణిని పెళ్ళిచూపులో చూచి, "కాబోయే అర్ధాంగ"నుకుంటూ మొదట కులికినా, గదినుండి ఇంటికప్పును సైతం భేదించుకు వెలువడుతున్న, ప్రసవ వేదనలను వింటూ కుమల వలసివచ్చేసరికి, మళ్ళీ మనసొకసారి తండ్రిమీదే విరుచుకుపట్టది.

"అంతా ఖర్మ"ని చాలాసార్లు అనుకోబోయే భౌతికవాదికి తగదని ఊరుకునేవాడు. భౌతిక వాదానికి ఖర్మకి మధ్య పుట్టుకపోనే ఉద్భవించిన వైరుధ్యంవల్ల ఎన్నోసార్లు కష్టాలుపడుతూనే బయటి కనడానికి మనసొప్పకపోయినా తనలో తనైనా "అంతా ఖర్మ"అనుకోక తప్పిందిగాదు.

తండ్రి ఆర్జించి కూడబెట్టిన ధనం, మస్తుగా కాకపోయినా, ఏ కొద్దిగానైనా ఉండి ఉంటే— "నిజంగా నువ్వు ఆ లక్ష్మీనారాయణుడవేరా, కుల దీపికా" అంటూ ముద్దిడుకొనేవాడు ఆ పసికూనని, పేరు పెడుతూనే అనుకున్నాడు, "ఆ లక్ష్మీనారాయణుని పేరుతో ఉద్భవించిన దరిద్ర నారాయణుడవేరా!" అని! దానికి తగ్గట్టు మాసం తిరక్కుండానే, పాలడబ్బీలకి పేచీపెట్టు కూర్చునేసరికి అసలే ఆయాసపడుతున్న హృదయానికి చెమటలు కూడా పట్టినై. పరిస్థితిని విపులీకరించినా, నిష్ప్రయోజనం. ఏం అర్థంచేసుకుంటుందీ పసికూన?

గట్టిగా ఓ అర్థశేరు బియ్యం, ఏదో గడ్డికరచి, ఏ వేళకు తెస్తే ఆ వేళే వంట. కాలే కడుపును మంచినీటితో సంతృప్తిపరచటానికి, అలవాటు పడటంవల్ల, రెండురోజుల కొకసారి, పొయ్యిలో మంట మండినా అంతగా బాధుండేదికాదు. పదిమంది పెద్దల సమక్షంలో, తనచేతులతో సగర్వంగా కట్టిన సూత్రాన్ని, భార్య చేతులతో తీసిస్తే పుచ్చుకొనక తప్పిందికాదు. దాని స్థానే పసుపుకొమ్ము ప్రత్యక్షం.

శోభనంనాటి రాత్రి సున్నగా నిగనిగలాడుతూ రక్తాన్ని చిమ్ముతూన్న చెక్కిళ్ళతో కళకళలాడుతున్న కళ్ళతో, వింత ఆకర్షణను కూర్చుకున్న అధరాలతో, నొక్కుల జుత్తుమధ్య, మల్లెపూలు తురుముకుని, వొంటిపై అంటీ అంటకుండా జారిపోతున్న జార్జెట్ వలువలలో మిసమిసలాడే నిండు యౌవనంలో, మిలమిల మెరిసిపోతూ ప్రత్యక్షమైన అర్ధాంగి భాగ్యలక్ష్మిని చూచి "నిజంగా నువ్వు నా పాలిట భాగ్యలక్ష్మివే సుమీ" అనుకున్నాడు. ఆనందం పట్టలేక బైటికి అనేశాడు కూడా, "లక్ష్మీ నువ్వు నాపాలిట భాగ్యలక్ష్మి" వని—"ఊఁ, పోదురూ" అంది తెచ్చిపెట్టుకున్న సిగ్గుతో.

చిఱు సిగ్గుతో తలవంచుకున్న భాగ్యలక్ష్మి మొఖాన్ని పైకెత్తి, ప్రియుని తీయని అధరాల స్పర్శకోసం, ఎదురుచూస్తున్న ఆ పెదాలపై ముద్దిడుకుంటూ ఆనందంతో పరవశత్వం చెందుతూ, "అబ్బ" అనుకున్నాడు అపుడు. ఇపుడూ, ఎప్పటికప్పుడు అబ్బా అనుకుంటూనే ఉన్నాడు తేడా స్వల్పమే-అపుడు ఆనందంతో, ఇపుడు బాధతో. అంతే.

తండ్రి బ్రతికున్నంతకాలం భాగ్యలక్ష్మి తన పాలిట భాగ్యలక్ష్మిగానే చలామణీ అయింది. తండ్రి గతించి, తను నిరుద్యోగిగా స్థిరపడ్డ అనంతరమే తనపాలిట అభాగ్యలక్ష్మిగా మారికూర్చుంది

పాలిపోయిన చెక్కిళ్ళు లోతుకుపోయిన కళ్ళతో, ఎముకలగూడులా తయారైన, భాగ్యలక్ష్మిని చూస్తుంటే తనగుండే తరుక్కుపోతూంది. అయినా ఏం చేయగలడు? అప్పటికి అందుబాటులో ఉన్నది ఒక్క 'ఏడ్పు'గానే కన్పించి సావకాశం చిక్కినప్పుడల్లా తలచుకుని కన్నీరు కార్చేవాడు కూడా. ఒకర్నిచూచి ఒకరు ఏడ్చుకోవడం, భాగ్యలక్ష్మి భగవంతుణ్ణి నిందించుకోవడం తను బూర్జువా ఇజాన్ని తిట్టుకోడం; చాలీచాలని తల్లిపాలతో కాళీ పాలపొడిడబ్బీనిచూచి చంటివాడు 'గీర' పెట్టడం—ఇత్యాది పరిస్థితుల ప్రోద్బలంవల్ల చంటిబిడ్డతోపాటు, భార్యనీ పుట్టింటికి పంపక తప్పలా రామానికి.

తల్లి బ్రతికుండగా తను ఫిఫ్తుఫారం అనుకుంటూ, చదువుతూండగా తల్లి అప్పుడప్పుడు అంటూండేది తండ్రితో "ఏమండీ కూడబెట్టింది శూన్యం, కనీసం ఓ పదివేలకో లేక ఐదువేలకో ఇన్సూర్ రన్నా చేయించుకో గూడదటండీ" అని.

"ఒకరికోసం ఒకరు కూడబెట్టటం ఏమిటికి?... విద్యాబుద్ధులు నేర్పించి, మనిషిగా తయారుచేస్తే వాడిజీవితం వాడు వెళ్లబోసుకోలేడూ"అంటూండే వాడు తండ్రి. తల్లేబ్రతికున్నట్లైతే అప్పుడాయనన్న మాటల్ని ససేమిరా ఇప్పుడంగీకరించుండేదికాదు.

ఆయన బ్రతికున్న రెండుసంవత్సరాల్లోనూ ఆయన పలుకుబడినికూడా తనడిగ్రీకి జతపర్చి, ఊరూ, వాడా గాలించినా ఉద్యోగం లభించలా-ఇంక లభిస్తుందన్న ఆశా,అంతరించింది-ఫ్చ్-ఏమిటో వెధవబ్రతుకు కనుకుంటూ ఏదో ఆలోచించుకుంటూ బృంద సభ్యులలో కొందరాడుతున్న అడ్డాటను యథాలాపంగా పరికస్తూ కూర్చున్న రామాన్ని గదిలోనుండే వేరొకమూలనుండి వెలువడ్డ మాటలు మేల్కొలిపినై. ఒక కంఠం అంటోంది.

ఫిగర్ ఈ విధంగా ఉన్నప్పుడు ఎప్పుడూ 'ఫోర్'యాక్షన్ చేసింది చార్టు, థియరీ ప్రకార చూసుకున్నా ఫోరు త్రీ-ఏ వస్తుంది ఫోర్ త్రీ-గన్‌షాట్ రాకపోతే ఇక ఈ చార్టే ముట్టను" అని రెండోకంఠంత కొల్పు ఖండించి పారేసింది.

"ఏడ్చావులేరా... వెధవ 'తీరో'లు నువ్వూను-చూడు కావాలంటే నేనోక థియరీ చూపిస్తా... ఫోర్,-ఓపెనింగ్ కరెక్టేకాని-క్లోజింగ్ మాత్రం ఫైవ్ బీరుపోదు....ఫోర్ - ఫైవ్ - గుద్దితే అంతా డబ్బే" అని.

సంభాషణనంతా విన్న రామం తలపంకించి లేచాడు.

ఓ నెలగడిచింతరువాత భార్యని పిల్లాడిని, మళ్ళీ తీసుకొచ్చాడు.

రామం బి. ఎ. బ్రాకెట్టు బుక్కర్.

రూపాయకు అణన్నర కమీషన్—

రూపాయివేసి అరవయినాలుగు రూపాయలు సంపాదించాలనే ఆకాంక్షవున్న ప్రజలవల్ల- కమీషమీషన్ పేరుతో రోజుకో మూడురూపాయలు గిట్టుబాటవుతున్నాయి. రక్షణశాఖ పలహారానికి గాను ఓ అర్థరూపాయి పోయినా నిఖరు సంపాదన నెలకి 75 రూ. రామం సంసారం సక్రమంగానే దొర్లిపోతూందిప్పుడు.

---

కథానిక

# కళా - శశికళా

కె. హనుమంతరావు

"లక్ష్మీప్రసాద్ అండ్ కోలో కదూ 'క్షణక్షణముల్...' ఉందన్నావూ?"

"ఏం, బజారుకు పోతున్నారా?"

"అవును."

"ఇప్పుడా పుస్తకం కొనుక్కురావల్సిన అవసరం లేదు."

"మరి పొద్దున కావాలన్నావు?"

"కాని ఇది సాయంకాలం...'సినిమాస్కోప్'కు పోదామని..."

"నాకు వీలుకాదు. నీవు పోయిరా. నేను బజారుకెళ్ళి రంగులు కొనుక్కుతెచ్చుకోవాలి."

... ... ... ... ...

రాజా వెళ్ళిపోయాడు. శశికళ రాజా పోయిన దారివంకే చూస్తూ వాకిట్లో నిల్చుండిపోయింది. ఆవేగంతో కిందిపెదవి వణుకుతున్నది. నల్లని నయనాంచలాలలోంచి బుగ్గలమీదుగా వెచ్చని బాష్పాలు జారుతున్నయ్. లోపలినుంచి ఆక్రోశం వస్తున్నది, ఆపుకోలేకపోతున్నది.

తను కాపరానికి వచ్చి దాదాపు నాలుగు నెలలయింది. ఒక్క సినిమాకూడా చూడలేదు. పుట్టింటిదగ్గరయితే నెలకు కనీసం నాలుగు సినిమాలయినా చూసేది. కాని ఈనాడు సినిమాస్కోప్ చూడాలని మనసయింది. నోరుతెరుచుకొని అడిగింది. ఆయనంత నిర్లిప్తంగా జవాబిచ్చిపోయాడు.

తనేంచేస్తుంది? ఒక్కతేపోతే ఆనందమేముంటుంది? తనకీనాటికీ రాజాతో పరిచయమయిన రోజునూతలుచుకుంటే ఎంతో ఆనందంకలుగుతుంది.

నాన్నగారు తీసికొచ్చి పరిచయం చేశారు. గొప్ప చిత్రకారుడు అని చెప్పారు. చేతిలో ఫైల్ ఉంది. అందులో కొన్ని బొమ్మలుతీసి చూపించారు. ప్రతిగీతలోను కొత్తదనం ఉంది. నాన్న చెప్పినది నిజమేననిపించింది. కాని వాటిలో స్త్రీల చిత్రాలు లేవు. స్త్రీలతో స్నేహంలేదు కాబోలు అనుకుంది. ఆ కొరత తను తీర్చగలననుకుంది; తీర్చింది.